అడవిలోకి జింకలు వదిలిన అధికారులు

నవతెలంగాణ-హాజీపూర్



పాత మంచిర్యాల సెక్షన్ పరిధిలోని క్వారీ జంగల్ సఫారీ రోడ్డులో మంగళవారం జింకలను వదిలారు. కరీంనగర్ డీర్ పార్క్ నుండి 14 డీర్స్ తీసుకొని వచ్చి ఇక్కడ వదిలారు. ఈ కార్యక్రమంలో అడవి మండల అధికారి సర్వేశ్వర్, క్షేత్ర అధికారి సుభాష్, ఎఫ్ఎస్ఓ అతహుల్ల, అల్తాఫ్, బీట్ ఆఫీసర్ రాజేందర్, సంతోష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ

ఆదిలాబాద్

1

బుధవారం | జనవరి 08, 2025 | www.navatelangana.com

ప్రమాదవశాత్తు ఇస్త్రీ షాపు దగ్ధం

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని దస్నాపూర్‌లో గల ఇస్త్రీ షాపు ప్రమాదవశాత్తు కాలిపోయింది. విషయం తెలుసుకున్న రజక సంఘం నాయకులు అక్కడికి చేరుకొని బాధితుడు కడదరపు సంటెన్నకు ధైర్యం చెప్పారు. సోమవారం రాత్రి 7.30 గంటలకు ఇస్త్రీ పనులు ముగించుకుని 8.30 గంటల వరకు షాపులో ఉండి ఇంటికి వెళ్లిపోయానని బాధితుడు సంటెన్న తెలిపారు. రాత్రి 10.30 గంటల సమయంలో షాపుల్లో మంటలు చెలరేగుతున్నాయని చెప్పడంతో అక్కడి చేరుకున్నట్టు పేర్కొన్నారు. అప్పటికే అగ్నిమాపక అధికారులు మంటలను అదుపు చేశారన్నారు. షాపులో ఉన్న మూడు ఇస్త్రీలతో పాటు ఫ్యాన్, టేబుళ్లు, కుర్చీలు, బట్టలు దగ్ధమయ్యాయని తెలిపారు. దాదాపు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని చెప్పాడు. నష్టపోయిన బాధితుడిని సామాజికవేత్త ముడుపు మౌనిష్‌రెడ్డి పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.



పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మంచిర్యాల: 7 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ప్రీ మెట్రిక్ హాస్టల్ ఉద్యోగులు మంగళవారం జిల్లా కేంద్రంలో గల మార్కిస్ట్ భవన్‌లో భారత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వివిధ హాస్టల్స్‌లో అవుట్ సోర్సింగ్‌లో విధులు నిర్వర్తిస్తున్న వాచ్‌మెన్, కుక్, కామాటిలకు ఏడు నెలలుగా జీతాలు రావడం లేదని, నిత్యావసరల వస్తువులు కొనలేని స్థితిలో జీవనం కొనసాగించాలంటే కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అసలే చాలీచాలని జీతాలు ఆపై సమయానికి రాక కాలం గడపడం గగనంగా మారిందని వాపోయారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు వెంటనే స్పందించి జీవితాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి నెల 10న జీతాలు పడేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో డి.బ్రహ్మానందం, వెంకటేష్, విజయ్, శ్రీనివాస్, సునీత, లత, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆరోగ్య విషయాలపై అవగాహన



మందమర్రి: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్ ఆధ్వర్యంలో జాతీయ ఆరోగ్య మిషన్ ఆరోగ్య విషయాలపై మార్కెట్ ప్రాంతంలో మంగళవారం అవగాహన కార్యక్రమం ప్రారంభించారు. గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని 40 గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా మార్కెట్ ప్రాంతంలో ప్రారంభించారు. ఆయుష్మాన్‌భవ ఆరోగ్య కేంద్రాలు, డిజిటల్ మిషన్, 100 శాతం గర్భవతుల నమోదు, 100 శాతం టీకాలు ఇవ్వడం, జాతీయ క్షయ, కుష్టు నివారణ, వ్యాధులను గుర్తించడంపై అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం. కుటుంబ సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొనడం మగవారికి వ్యాసెక్టమి, ఆడవారికి ట్యూబెక్టమి కుటుంబ నియంత్రణ పద్ధతులు, హెచ్ఐవి ఎయిడ్స్, జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలను కళాకారుల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రమేష్ బృందం, డాక్టర్ రమేష్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులకు శ్రీకాంత్‌రెడ్డి సన్మానం



ఆదిలాబాద్‌రూరల్ : ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, ఏఐసిసి కార్యదర్శి విశ్వనాథ్ పెరుమాళ్, ప్రోటోకాల్ చైర్మన్ వేణుగోపాల్‌ను తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి తన నివాసంలో సన్మానించారు. పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మావలలోని శ్రీకాంత్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. నాయకులను కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లాలోని రాజకీయాలు, సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్, మాజీ మంత్రి వేణుగోపాలచారి, జీసీసి చైర్మన్ కొట్నాక తిరుపతి, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క, ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడే గజేందర్, శ్యామ్‌నాయక్, తలమడుగు మాజీ జడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి, సారంగాపూర్ మాజీ జెడ్పిటిసి పత్తి రాజేశ్వర్‌రెడ్డి, ఏఐసిసి మెంబర్ నరేష్ జాదవ్ పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

కుభీర్ : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని పల్సి, గోడాపూర్, మలేగాం గ్రామాలను సందర్శించారు. గ్రామాల్లో ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేలను పూర్తి చేసేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తూ వీధి దీపాలు, నీటి సదుపాయం కల్పించేలా చూడాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీఓ మోహన్‌సింగ్, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

రేపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ఉట్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా గ్రాన్యూల్స్ ఫార్మా కంపెనీలో జూనియర్ కెమిస్ట్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగానికి ఇంటర్ ఎంపీసీ/బైపిసి 2023,2024లో పూర్తయి, కెమిస్ట్రీ సబ్జెక్టుతో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.2.05లక్షల జీతం, శిక్షణ సమయంలో ఉచిత హాస్టల్, భోజన వసతితో పాటు ప్రతి నెల స్టైఫండ్ ఉంటుందని తెలిపారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఎంపికైతే వారు డిగ్రీ పూర్తి చేసుకోవడానికి కంపెనీ నుంచి తగిన సహకారం అందించబడుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్స్, ఆధార్, పాన్ కార్డుతో పాటు రెండు ఫొటోలతో 9న ఉదయం 10గంటలకు కళాశాల ప్రాంగణంలో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు టాస్క్ కో ఆర్డినేటర్ ముజీబ్, మెంటర్ చైతన్యను 9885762227 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆదివాసీ మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



కాసిపేట : మండలంలోని ఉమ్మడి సోనాపూర్ గ్రామ పంచాయతీ ఆదివాసీ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను సాలేగూడ, గట్రాప్పల్లి క్రీడా ప్రాంగణంలో ప్రారంభించారు. ముందుగా కుమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ముఖ్య అతిథిగా దేవాపూర్ ఎస్ఐ ఎ.ఆంజనేయులు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెందూర్ చందు, మడావి భారిక్‌రావ్, మాజీ సర్పంచులు పెంద్రం సింగు, పెంద్రం రాజు, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు సంద్ర భూమన్న, కార్యదర్శి తనూజా, సిడాం గణపతి, పెందూర్ ప్రభాకర్, శ్రీనివాస్, కృష్ణ, మోహన్, భీంరావ్, మెస్రం భీంరావ్ పాల్గొన్నారు.

ఏండ్లు గడుస్తున్నా..అధోగతే..!

- కొత్త మండలాల్లో మెరుగుపడని పరిస్థితులు
- శిథిల భవనాలు..అరకొర సౌకర్యాలతో సతమతం
- తగినంత సిబ్బంది లేకపోవడంతోనూ సమస్యలు
- మౌళిక వసతులపై దృష్టిసారించని ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న అధికారులు, ప్రజలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న చింతలమానేపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఇది. ఈ భవనం కింది భాగంలో ప్రాథమిక పాఠశాల కొనసాగుతుండగా.. పై భాగంలో తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతోంది. దీంతో ఇటు విద్యార్థులకు..అటు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఇబ్బందికరంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితిలో మిగితా కొన్ని మండలాల్లోనూ కనిపిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో కొత్త మండలాలు ఆవిర్భవించి ఏండ్లు గడిచినా అధోగతి తప్పడం లేదు. కనీస వసతులు లేక అధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస మౌళిక వసతులు లేకపోవడంతో అసౌకర్యానికి గురవుతున్నారు. అప్పటి ప్రభుత్వం పరిపాలన సౌకర్యార్థం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 18 కొత్త మండలాలను ఏర్పాటుచేసింది. అధికారులు, కొందరు సిబ్బందిని నియమించినా పూర్తిస్థాయిలో నియమించకపోవడంతో పనులు సకాలంలో జరగక నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం అవసరమైన సౌకర్యాలు మాత్రం కల్పించలేకపోయింది. దీంతో వాటిలో నియామకమైన అధికారులు, సిబ్బంది నిత్యం అవస్థలు పడుతూ విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఇప్పటికీ సొంత భవనాలు లేకపోవడం.. అద్దె భవనాల్లో అరకొర సౌకర్యాల మధ్యనే కార్యాలయ పనులు నిర్వర్తించాల్సి వస్తోంది. సౌకర్యాల కల్పనపై అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించగా.. కనీసం కొత్త ప్రభుత్వమైనా దృష్టిసారించాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగు జిల్లాలుగా విభజించింది. అనంతరం పరిపాలన సౌలభ్యం కోసం 2016 అక్టోబర్‌లో 18 కొత్త మండలాలను ప్రకటించింది. ఆదిలాబాద్ జిల్లాలో ఐదు మండలాలను ఏర్పాటుచేసింది. ఆదిలాబాద్ జిల్లాలో మావల, ఆదిలాబాద్ గ్రామీణం, సిరికొండ, గాదిగూడ, భీంపూర్ మండలాలు ఏర్పాటుచేయగా.. నిర్మల్ జిల్లాలో సోన్, బాసర, దస్తూరాబాద్, నర్సాపూర్(జి), నిర్మల్ గ్రామీణ, పెంబి మండలాలు ఏర్పాటు కాగా..మంచిర్యాల జిల్లాలో హాజీపూర్, భీమారం, కన్నెపల్లి, నస్పూర్ మండలాలు ఏర్పాటు కాగా.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో చింతలమానేపల్లి, లింగాపూర్, పెంచికల్‌పేట్‌లను మండలాలుగా ఏర్పాటుచేసింది. వీటితో పాటు ఆదిలాబాద్ జిల్లాలో ఏడాది క్రితం మరో మూడు కొత్త మండలాలను ప్రకటించింది. సొనాల, భోరజ్, సాత్నాల మండలాలను ప్రకటించినా..ఇంకా అధికారులు, సిబ్బంది నియామకంతో పాటు కార్యాలయాలను ఇంకా ఏర్పాటుచేయలేదు. ఇది వరకు ఉమ్మడి జిల్లాలో 52 మండలాలు ఉండగా ప్రస్తుతం 70కి చేరుకున్నాయి. ఈ మూడు కొత్త మండలాలతో వీటి సంఖ్య 73కి చేరడం గమనార్హం.

సౌకర్యాలు లేక అవస్థలు..!

కనీసం ఆయా మండల కేంద్రాల్లో సొంత భవనాలు లేకపోవడంతో ఉన్న అద్దె భవనాల్లోనూ కనీస సౌకర్యాలు లేకపోవడంతో కార్యాలయ కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడుతోంది. ఇప్పటికీ సొంత భవనాలు నిర్మించకపోవడంతో పాటు వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది అసౌకర్యానికి గురవుతున్నారు. మావల తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. చింతలమానేపల్లిలో ప్రభుత్వ పాఠశాల పై భాగంలో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుచేశారు. సిరికొండ మండలంలో పోలీసు స్టేషన్, ఎమ్మార్వో కార్యాలయం పాత భవనాల్లో కొనసాగుతుండగా.. ఎంఈఓ కార్యాలయం పాఠశాలలోనే ఏర్పాటుచేశారు. గాదిగూడ మండలంలోనూ ఈ కార్యాలయాలు శిథిలావస్థలోనే ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో కల్పించాల్సిన కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా కొన్ని చోట్ల అవసరమైన కింది స్థాయి సిబ్బంది లేకపోవడం.. ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు పంచాయతీల బాధ్యతలు అప్పగించడంతో పనుల్లోనూ వేగం పెరగడం లేదు. ముఖ్యంగా సిర్పూర్(యు) నుంచి విడిపోయిన లింగాపూర్ మండలంలో కనీస సౌకర్యాలు కూడా కనిపించడం లేదు. ఇక్కడ తహసీల్దార్ కార్యాలయం పాఠశాల భవనంలోనే కొనసాగుతోంది. వీటితో పాటు వివిధ కార్యాలయాలు సైతం చిన్నపాటి పాత భవనాల్లో కొనసాగుతుండంతో కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడుతోంది. కేవలం ఆయా మండల కేంద్రాల్లో కస్తూర్బాగాంధీ విద్యాలయాలు మాత్రమే నిర్మాణాలు పూర్తిచేసుకున్నాయి. కనీసం కొత్త ప్రభుత్వమైనా స్పందించి కార్యాలయాల నిర్మాణాలకు ప్రాధాన్యమివ్వాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన భవనంలో కొనసాగుతున్న మావల తహసీల్దార్ కార్యాలయం

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా కృషి

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



నవతెలంగాణ-మంచిర్యాల

వేంపల్లి గ్రామంలో ఇండస్ట్రీయల్ హబ్ ఏర్పాటుతో జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని, భూములు కోల్పోయిన వారికి నెల లోపు నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో గల పద్మనాయక ఫంక్షన్ హాలులో భూ నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇండస్ట్రీయల్ హబ్ కోసం స్వచ్ఛందంగా భూములు ఇస్తున్న భూ యజమానులకు ప్రేమ్‌సాగర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఎకరానికి రూ.13.50లక్షలు పరిహారంగా చెల్లిస్తామని, దీంతో పాటు దసరా నాటికి అన్ని సౌకర్యాలతో ఇల్లు నిర్మించి అప్పగిస్తానని హామీ ఇచ్చారు. పరిశ్రమల ఏర్పాటు తర్వాత భూనిర్వాసితుల కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. దళారులను నమ్మి మోసపోవద్దని, ఎల్లంపల్లి నిర్వాసితులకు ఇప్పటికీ పరిహారం అందలేదని గుర్తు చేశారు. పారిశ్రామిక రంగం అభివృద్ధి విషయంలో ఎవరు అడ్డుపడినా సహించబోమని స్పష్టం చేశారు. విపక్షాలు అభివృద్ధిని అడ్డుకోవాలనే కుట్ర పన్నాయని, బీజేపీ ఓట్ల కోసం మతాన్ని అడ్డు పెట్టుకుందని, బీఆర్ఎస్ దుకాణం బంద్ అయిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తానన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



జైపూర్ : చెన్నూర్ పట్టణంలో రూ.20లక్షలతో నిర్మించతలపెట్టిన అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే గడ్డం వివేక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు తాను ఎంపీగా ఉన్నప్పట్నుండి అడుగుతున్నారని తెలిపారు. ఎట్టకేలకు చెన్నూర్ ప్రాంత ప్రజల ఆకాంక్ష నెరవేరబోతోందన్నారు. నేతకాని భవన్ నిర్మాణానికి ప్రతిపాదిత స్థలాన్ని స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. వీలైనంత త్వరగా ఇక్కడ నేతకాని భవన్ నిర్మించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ముదిరాజ్ భవన నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని పేర్కొన్నారు.

వన్యప్రాణుల వేటగాళ్ల పట్టివేత



హాజీపూర్ : వన్యప్రాణులను వేటాడే ముఠాను ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అత్తే సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని టీకానపల్లి, బుద్ధిపల్లికి చెందిన సాగర్, ప్రశాంత్, జాడి రాజలింగు, వినోద్, రాములు ఐదుగు కలిసి దండేపల్లిలో బైండింగ్ వైర్ కొనుగోలు చేశారు. టీకానపల్లిలో జాడి రాజలింగు పత్తి చేనులోని కరెంట్ వైర్ నుండి రెండు కిలోమీటర్ల దూరం వరకు బైండింగ్ వైర్ వేసి వన్య ప్రాణులను వేటాడే యత్నం చేశారు. ఈ నెల 3న గమనించిన ఫారెస్ట్ సిబ్బంది విచారణ చేసి మంగళవారం వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ 1972 ప్రకారం కేసు నమోదు చేశారు. మూడు రోజుల క్రితమే వన్యప్రాణుల వేటగాళ్లను అదుపులోకి తీసుకొని బేరసారాలు చేసి విషయం బయటకు పొక్కడంతో అప్రమత్తమైన ఫారెస్ట్ అధికారులు ఎట్టకేలకు మంగళవారం వారి అరెస్టు విషయాన్ని ప్రకటించారని విమర్శలు వస్తున్నాయి.

బాక్సింగ్‌లో సత్తా చాటే వారికి ప్రోత్సాహం



నవతెలంగాణ-నస్పూర్

బాక్సింగ్ క్రీడపై మక్కువ కలిగి ఉండి క్రీడల్లో సత్తా చాటే వారికి అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని కార్యదర్శి బోయిని రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం సీసీసీ నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో బాక్సింగ్ క్రీడాకారుడు ఆదర్శ్ ఇటీవల తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించి ట్రెనింగ్ పూర్తి చేసుకొని వచ్చిన సందర్భంగా జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆదర్శ్ సాధించిన ఉద్యోగం ఎంతోమంది క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. బాక్సింగ్ సీనియర్ కోచ్ చైర్మన్ మైసూర్ శిక్షణలో గతంలో పదుల సంఖ్యలో క్రీడాకారులు కేంద్ర, రాష్ట్ర పోలీస్ శాఖలలో ఉద్యోగాలు పొంది సేవలందిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా అదే స్ఫూర్తితో గురువు ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని, క్రీడాకారులకు తమ వంతు సహాయ సహకారాలు అందించడంలో ఎప్పుడు సిద్ధంగా ఉంటామని తెలిపారు. జిల్లాలో బాక్సింగ్ అసోసియేషన్ ఏర్పడిన అనతి కాలంలోనే ఎన్నో విజయాలను నమోదు చేసుకుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా జిల్లాలో బాక్సింగ్ ఫౌండర్ కేశదాస్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ బాక్సింగ్ క్రీడను మారుమూల గ్రామాలకు విస్తరిస్తామని తెలిపారు. ఇటీవల ఆలిండియా యూనివర్సిటీ స్థాయి పోటీలలో పాల్గొని వచ్చిన ఒల్లాల గణేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో అసోసియేషన్ ద్వారా నిర్వహించబడే వేసవి శిక్షణ శిబిరాలను క్రీడాకారులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పాదం రవీందర్, చిరంజీవి, కోచ్‌లు జగత్ సాయి, సందీప్, ఫెన్సింగ్ సీనియర్ క్రీడాకారుడు బోయిని అశోక్ పాల్గొన్నారు.

బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం

కాసిపేట : మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షులు సూరం సంపత్ కుమార్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా బీజేపీ సభ్యత నమోదు జిల్లా కన్వీనర్ ఎనగందుల కృష్ణమూర్తి, మండల ఎన్నికల అధికారి మోటపలుకుల గురువయ్య, మండల ఇన్‌చార్జి కేశవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ బూత్ కమిటీల ద్వారా పార్టీని బలోపేతం చేయాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవాలన్నారు. అనంతరం బూత్ అధ్యక్షులకు సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేవనూరు సంతోష్, మండల ప్రధాన కార్యదర్శి రెడ్డి బాలరాజ్, మండల ఉపాధ్యక్షులు పెద్దపల్లి శంకర్, యువ మోర్చా మండల అధ్యక్షులు మేసం తిరుపతి, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు వనిత, మండల నాయకులు దోమల రాంచందర్, గుంపుల సదయ్య, రంజిత్ కుమార్, బూత్ అధ్యక్షులు సూత్రాల కార్తీక్, ఐలి సురేందర్, గొల్లపల్లి రాజేందర్, గణేష్, దగడు సాయి పాల్గొన్నారు.

సంక్రాంతి వేడుకలు జాగ్రత్తలతో జరుపుకోవాలి

నవతెలంగాణ-కుభీర్

సంక్రాంతి పండగను జాగ్రత్తలతో జరుపుకోవాలని ఎస్ఐ రవీందర్ తెలిపారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో యువకులు, విద్యార్థులు గాలిపటాలు ఎగురేయడానికి చైనా మంజా వాడరాదన్నారు. కిరాణా షాపుల యజమానులు చైనా మంజా అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. గాలి పటాలు ఎగరేసే సమయంలో పిల్లలు దాబాలపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

నవతెలంగాణ-లోకేశ్వరం

రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై జి.అశోక్ అన్నారు. మంగళవారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై



అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు భద్రతకు సంబంధించి ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, ఆటో డ్రైవర్లు మద్యం తాగి ఆటో నడుపొద్దని అన్నారు. అదేవిధంగా తమ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని అన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె విరమణ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లాలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆధ్వర్యంలో గత 29 రోజులుగా కొనసాగుతున్న నిరవధిక సమ్మెను మంగళవారం విరమించి, విధుల్లో చేరుతున్నట్టు డీఈఓకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షులు భూసారపు గంగాధర్ మాట్లాడారు. ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించి, ఆర్థికేతర విషయాలకు నెల రోజులు, ఆర్థికపరమైన విషయాల పరిష్కారానికి మూడు నెలల సమయం కోరినందున, ప్రభుత్వంపై నమ్మకంతో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్టు తెలిపారు.



రైతుల ఉద్యమాల్లో ముందుండేవారు



నవతెలంగాణ-ఆదిలాబాద్

మాజీ రైతుబంధు సమితి అధ్యక్షుడు రోకండ్ల రమేష్ రైతు ఉద్యమాల్లో ఎల్లప్పుడు ముందుండేవారని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సంతాప సభ కార్యక్రమంలో పలువురు అఖిలపక్ష నేతలు, ప్రజా సంఘాల బాధ్యులు, బీఆర్ఎస్ కార్యకర్తలు హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మాట్లాడారు. ప్రజా, రైతుల సమస్యల పట్ల రోకండ్ల రమేష్ చూపించిన చొరువను గుర్తుచేశారు. ఆయన్ను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మెన్‌కు సన్మానం

నవతెలంగాణ-ఉట్నూర్

ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ముఖాడే ఉత్తం, వైస్‌చైర్మెన్ సాయం మారుతీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఉట్నూర్ నాయకులు బానోత్ జైవంత్ రావ్, జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బిరుదుల లాజర్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్, సయ్యద్ నిసార్, జాదవ్ రాజేష్, రవి, దర్శని గంగరాజు, సుశీల్ వారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు.

ఉదారత చాటిన ఆటో డ్రైవర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓ ఆటో డ్రైవర్ మానవత్వంతో ఉదారతను చాటుకున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మి వాడకు చెందిన ఆటో డ్రైవర్ శివప్రసాద్ రాంపూర్ వద్ద మంగళవారం ఉదయం ఒక ప్రయాణికుడిని ఎక్కించుకొని పంజాబ్‌చౌక్‌లో దింపేశారు. అయితే ఆటోలో ప్రయాణికుడు సలీమ్ తన ఫోన్ మర్చిపోయాడు. కాసేపటికి సలీమ్ ఫోన్ రింగ్ అవ్వగా డ్రైవర్ చూసి స్పందించి సలీమ్‌తో మాట్లాడారు. అనంతరం డ్రైవర్‌ను సలీమ్ కలువగా ఫోన్ తిరిగి ఇచ్చేశారు. దీంతో సలీమ్ సంతోషించి, డ్రైవర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మావల మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బోధనేతర పోస్టులకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్టు ఎంఈఓ నర్సయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలో నైట్ వాచ్ ఉమెన్ పోస్ట్(01), మావల మండలం లోని హెడ్ కుక్ (01), అసిస్టెంట్ కుక్ (01), నైట్ వాచ్‌ఉమెన్ పోస్ట్ (01), డే వాచ్ ఉమెన్ పోస్ట్ (01), స్వీపర్ (01) తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆయా ఎంఈఓ కార్యాలయంలో ఈనెల 10 తేదీలోపు దరఖాస్తు అందజేయాలని తెలిపారు.

నూతన బూత్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని హస్నాపూర్ గ్రామంలో 105, 106 నూతన బూత్ కమిటీలను మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకులు రితేష్ రాథోడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండరి రమేష్, తన్నీరు సతీష్, మండల ప్రధాన కార్యదర్శి బింగి వెంకటేష్, కిషన్, మహేందర్, కైలాష్, గావులే అమర్నాథ్, రాథోడ్ దీపక్, విఠల్ గ్రామ నాయకులు ముత్తన్న తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నేరడిగొండ

ఎమ్మార్పీఎస్ ఉద్యమ సంస్థాగత నిర్మాణంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు మండల ఇన్‌చార్జి గజ్జల శంకర్ అధ్యక్షతనలో మండల కమిటీ ఎన్నిక పరిశీలకులుగా రాష్ట్ర సీనియర్ నాయకులు కూడాల స్వామి కాంబ్లే బాలాజీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా గజ్జల అశోక్, ఉపాధ్యక్షులుగా చుంచు రవి, ప్రధాన కార్యదర్శిగా బిక్కి రాకేష్, అధికార ప్రతినిధి గజ్జల సంతోష్, కార్యదర్శిగా ఓడ్డేపల్లి సురేష్, సంయుక్త కార్యదర్శి చిర్ర గంగాధర్, ప్రచార కార్యదర్శిగా జూల అడెల్లు, కార్యవర్గ సభ్యులుగా జొన్నల అశోక్, అంకుష్, బిక్కి అడెల్లు, నలిగంటి ప్రశాంత్, పౌలే జ్ఞానేశ్వర్, బాయ మహేష్, ఒరగంటి ప్రవీణ్, వాగ్మారే దీపక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు గోటిముక్కులే మధుకర్, గజ్జల అశోక్, గోనె అడెల్లు, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రాజేశ్వర్ ఉన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్‌ల ఆవిష్కరణ

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో మంగళవారం తెలుగు దినపత్రికలు సాక్షి, ఆంధ్రజ్యోతి, చట్టం దినపత్రికలతో పాటు స్వప్న మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నూతన సంవత్సర క్యాలెండర్లను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, ప్రకాష్, పండరీ, ప్రతాప్, లింబాజి పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

నిర్మల్‌టౌన్ : చైనా మాంజా వాడటం వలన ప్రజలకు, జంతువులకు ప్రాణాపాయం వాటిల్లే ప్రమాదం ఉందని, జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాబోయే సంక్రాంతి పండగ సందర్భంగా చైనా మాంజా ఎక్కువగా విక్రయించే దుకాణాలపై అధికారులు తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. నైలాన్, సింథటిక్ ధారాలతో తయారుచేసే ఈ చైనా మాంజాతో ప్రమాదాలు జరుగుతాయని, ఎవరైనా చైనామాంజా విక్రయిస్తే డయల్ 100 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

పేదింటి ఆడపడుచులకు వరం కల్యాణలక్ష్మి

కుభీర్ : పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వరం లాంటాదని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 76 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ముధోల్ నియోజకవర్గంలో ఉన్న ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం వివిధ కారణాల వల్ల అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న 26మంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ రేకుల గంగా చరణ్, బీజేపీ మండలాధ్యక్షుడు ఏశాల దత్తాత్రి, మండల నాయకులు గులాబ్ నాయక్, గంగా శేఖర్, దత్తహరి పటేల్, సౌంలీ రమేష్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ అశోక్, తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, బీజేపీ కార్యకర్తలు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులు పాల్గొన్నారు.

వైమానిక దళ ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశసేవ చేయడంలో భారత వైమానిక దళంలో చేరేందుకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. భారత వాయుసేనలో అగ్నివీర్ వాయుగా చేరేందుకు ఈనెల 7 నుంచి 27వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులపై మంగళవారం ఎస్టీయూ భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. అంతకుముందు రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రవాణ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడారు. నేవీలో చేరేందుకు ఓ మంచి అవకాశం ఉందన్నారు. టెక్నికల్‌తో పాటు నాన్ టెక్నికల్ కోర్సుల్లో ఉద్యోగాలున్నాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఏ విధంగా దరఖాస్తులు చేసుకోవాలి, ఏ విధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలో అవగాహన కల్పిస్తున్నారన్నారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ భారత సైన్యంలో చేరాలన్నారు. నైపుణ్యాలను బట్టి ఉద్యోగాలున్నాయని, వాటి గురించి తెలుసుకోవాలన్నారు. భారత వాయుసేనలో అగ్నివీర్ వాయుగా చేరేందుకు 2005 జనవరి 1 నుంచి 2008 జులై 1 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, సెలక్టర్ సెంటర్ సెర్జియంట్ ఎస్ఈ జట్, కార్పోరల్ ఎస్.సందీప్, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్‌దాస్, మేజర్ డాక్టర్ కరుణకర్, క్యాప్టెన్ మజర్ హుస్సేన్, న్యాయవాది విశ్వనాథ్, ఎంవీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాం

నవతెలంగాణ-నార్నూర్

• ఎమ్మెల్యే కోవ లక్ష్మి



గ్రామాలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని నాగల్‌కొండ నుంచి నార్నూర్ రోడ్డుకు భూమిపూజ చేశారు. ముందుగా మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 73 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. మండలాభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా కృషి చేద్దామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మీని సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం గజానంద్ నాయక్ మాట్లాడుతూ మండంలోని అనేక గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదని, రోడ్ల నిర్మాణానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్, మాజీ ఎంపీపీ కనక మోతుబాయి, ప్యాక్స్ ఇన్‌చార్జ్ చైర్మెన్ సురేష్ ఆడే, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, మర్సకోల సరస్వతి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దేవరావ్ లోఖండే, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేస్రం హనుమంతరావ్, సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు రూప్‌దేవ్, మాజీ జెడ్పీటీసీ బ్రిజు లాల్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, ఎంపీడీఓ జవహర్ లాల్, తహసీల్దార్ రాజలింగం పాల్గొన్నారు.

చైనా మాంజా దారాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు

• ఎస్సై జి.అశోక్



నవతెలంగాణ-లోకేశ్వరం

గాలిపటాలు అమ్మేవారు చైనా మాంజా దారాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జి.అశోక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వివిధ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. సంక్రాంతి సెలవుల్లో చిన్నపిల్లలు గాలిపటాలను ఎగురవేసే క్రమంలో చైనా మాంజాను వాడుతూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను గాలిపటాలు అమ్మేవారు సైతం చాటు మార్గాన పిల్లలకు అమ్ముతూ మనుషులతో పాటు పక్షుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. చైనామాంజా వాడొద్దని, దానిని అమ్మినా, నిల్వ చేసినా, అక్రమ రవాణా చేసిన చట్ట ప్రకారం శిక్షింపబడతారని హెచ్చరించారు. చైనా మాంజా వాడకం వల్ల కలిగే అనర్థాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్ర పర్యావరణ చట్టం (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్-2016) ప్రకారం చైనా మాంజా వాడకాన్ని నిషేధించినట్టు తెలిపారు. చైనా దారం అమ్మకం గురించి వివరాలు తెలిస్తే 8712659541 నెంబర్‌కి తెలుపాలని కోరారు.

చైనా కొత్త వైరస్‌తో అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చైనా నుంచి కొత్త వైరస్ హెచ్ఎంపీవీ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు రద్దీ ప్రాంతాల్లో వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. నిక్షయ్ వంద రోజుల టీబీ స్క్రీనింగ్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఉద్యోగులకు టీబీ పరీక్షలతో పాటు ఇతర పరీక్షలు నిర్వహించారు. దీనికి కలెక్టర్ పాల్గొని పరీక్షలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ చైనా నుంచి వచ్చిన కొత్త వైరస్ బెంగళూరులో వ్యాప్తి చెందుతుందన్నారు. రాష్ట్రంలో, జిల్లాలో అలాంటి కేసులు రాలేదన్నారు. అయిన కూడా ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ వ్యాధులకు దూరంగా ఉండాలన్నారు. వృద్ధులు, చిన్నారులు రద్దీ ప్రదేశాల్లో వెళ్లే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా ఫ్లూ లక్షణాలున్న వారు ఇంటి నుంచి బయటకు రావొద్దని వైద్యులను సంప్రదించి చికిత్సలు పొందాలని అన్నారు. టీబీ నియంత్రణలో భాగంగా నిక్షయ్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో 200 మంది ఉద్యోగులకు



వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, టీబీ అధికారి డాక్టర్ సుమలత పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నెరవేర్చాలి



నవతెలంగాణ-నేరడిగొండ

ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చాని జిల్లా లైవ్ అధ్యక్షుడు మహేందర్ జాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరంలో చేసిన అభివృద్ధి పనులకు ఇప్పటివరకు నిధులు విడుదల కాక మాజీ సర్పంచులు, కాంట్రాక్టర్లు, వడ్డీలు చెల్లించలేక అగమ్య గోచరంగా ఉందన్నారు. గత నెలలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రూ.10 లక్షలలోపు ఉన్న పెండింగ్ బిల్లులన్నీ ఇస్తానన్న హామీని త్వరలో నెరవేర్చాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి ఇచ్చిన హామీని నెరవేర్చాలని, గత రెండు సంవత్సరాలు పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటిని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మంజూరు చేయని యెడల చావే శరణ్యమని సర్పంచులు, కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ పాండు లైవ్ మండల బాధ్యులు భీమ్‌రావు, దేవీలాల్, పవన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలల హక్కులను తెలుపడానికే ప్యారా లీగల్ వాలంటీర్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చిన్నారుల హక్కులతో పాటు వారికి ధైర్యం చెప్పడానికి ప్యారా లీగల్ వాలంటీర్లు పని చేస్తారని, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. మంగళవారం డీఎల్ఎస్ఏ కార్యాలయ సమావేశ మందిరంలో ప్యార లీగల్ వాలంటీర్లకు రెండు శిక్షణ సదస్సును ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా ప్యారలీగల్ వాలంటీర్ల పని గురించి తెలియజేశారు. చిన్నారులపై అనేక అఘాయిత్యాలు జరుగుతున్నాయని అవి బయటకు రావడం లేదని అన్నారు. కోర్టుల్లో వచ్చిన కేసుల్లో వారికి న్యాయం జరిగేలా ప్యారలీగల్ వాలంటీర్లు అవగాహన కల్పించడంతో పాటు న్యాయ సాయం అందించాలన్నారు. చిన్నారుల హక్కులు, చట్టాలు తదితర అంశాలపై రెండు రోజుల పాటు జరిగే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శివరాం ప్రసాద్, హుస్సేన్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య పాల్గొన్నారు.

ఆదిలాబాద్ డీఈఓకు గుండెపోటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ డీఈఓ ప్రణీత గుండెపోటుకు గురైంది. సోమవారం ఇంట్లో ఉండగా రాత్రి సమయంలో ఒక్కసారిగా గుండెపోటుతో అస్వస్థతకు గురైంది. వెంటనే కుటుంబీకులు పట్టణంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రణీతను మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ఎలాంటి ఆందోళనకు గురి కాకూడదని సూచించారు. మెరుగైన చికిత్స అందించడం జరుగుతున్నదని, ఆరోగ్యం నిలకడగా ఉందని, కోలుకుంటారని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్ సిబ్బంది ఉన్నారు.

9న లూయిస్ బ్రెయిలీ జయంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

జిల్లా కేంద్రంలోని డీటీడీసీ సమావేశ మందిరంలో అంధుల ఆశాజ్యోతి లూయిస్ బ్రెయిలీ 9న నిర్వహించే 216వ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్టు డీడబ్ల్యూఓ సబిత తెలిపారు. అంధ విద్యార్థులు, అంధ ఉద్యోగులు, అంధ ఉపాధ్యాయులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యూత్ సభ్యులకు వాలీబాల్ కిట్ల పంపిణీ

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామానికి చెందిన యూత్ సభ్యులకు మంగళవారం అదే గ్రామానికి చెందిన పూలే వెల్ఫేర్ సొసైటి అధ్యక్షుడు గాజుల పోతన్న ఉచితంగా వాలీబాల్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణించి, మంచి చదువులు చదివి, ఉద్యోగాలు పొందాలని సూచించారు. అలాగే మరిన్ని సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రంజిత్, రమాకాంత్, హరిసింగ్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-బేల

మండలంలోని చాంద్‌పల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ డీడీ జాదవ్ వసంత్‌రావ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో స్టోర్ రూమ్, డైనింగ్ హల్, రికార్డులతో పాటు పరిసరాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీడీ జాదవ్ వసంత్‌రావ్ మాట్లాడుతూ రాబోయే వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకొని పదో తరగతి ఫలితాల్లో వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణులు అయేలా సంసిద్ధం చేయాలని ప్రధానోపాధ్యాయుడు కుర్సంగె నిలకంఠ్‌ని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది డీడీని సన్మానించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న మ్యాక్స్ : వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ద్విచక్రవాహనాన్ని మ్యాక్స్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని అంతర్‌రాష్ట్ర రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని దస్నాపూర్‌కు చెందిన రవి(37) ద్విచక్రవాహనంపై వెలుతుండగా మ్యాక్స్ వాహనం ఢీకొట్టింది. దీంతో రవి తలకు తీవ్ర గాయాలై రక్తస్రావంతో రోడ్డుపై పడిపోయాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, రిమ్స్‌కు తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ముజాహిద్ తెలిపారు.

సమస్యల పరిష్కారం ప్రభుత్వాలు విఫలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ ఆరోపించారు. మంగళవారం ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వంలో మంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు గౌరవ వేతనం కనీసం రూ.20 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రకళ, ఛాయ, సంగీత, సుశీల, రుక్మిణి, జంగు బాయి పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని కొత్తపెల్లి(హెచ్) సేవాలాల్ దీక్ష భూమిలో 46వ గురుకృప దినోత్సవ జాతర సందర్భంగా మంగళవారం దివ్యశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కబడ్డీ, క్రికెట్ పోటీలను దీక్ష గురు ప్రేమ్ సింగ్ మహారాజ్, దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రీడా పోటీలతో వ్యక్తుల మధ్య స్నేహసంబంధాలు మెరుగవుతాయన్నారు. క్రీడల్లో పాల్గొనే వారు అన్ని రంగాల్లో రాణిస్తారని, క్రీడాకారులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారి వెంట ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

పెన్షన్ మంజూరు చేయాలి

నవతెలంగాణ-బోథ్

కొత్త బీడీ కార్మికులకు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుభాష్ చంద్రను కలిసి బీడీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ మాట్లాడుతూ 2014 తర్వాత కొత్త బీడీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాల నుంచి నూతన బీడీ కార్మికులు దరఖాస్తు చేసుకున్న ఇప్పటివరకు వారికి ఎలాంటి పెన్షన్ అందడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోదావరి, భోజన్న, నరేష్, కార్తీక్, నితీష్, మున్సిఫ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-బేల

మండలంలోని కీర్తన డిగ్రీ కళాశాల నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల మండలంలో డిగ్రీ విద్య అభివృద్ధి కోసం పాటుపడటం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులతో పాటు కీర్తన డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డా.వరప్రసాద్‌రావు, పరీక్ష ఇన్‌చార్జి సాగర్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | జనవరి 08, 2025 | www.navatelangana.com

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

నవతెలంగాణ-దహెగాం



క్రీడాకారులు గెలుపోటములు సమానంగా తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని గిరవెల్లి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ముగింపుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. యువత అనుకుంటే సాధించలేని అంటూ ఏమీ లేదన్నారు. తెలుపొందిన జట్లకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై కందూరి రాజు, బీఆర్ఎస్ నాయకులు షాకీర్, బాలు నాయక్, మల్లేష్ పాల్గొన్నారు.

పత్రికలు ప్రజలు, ప్రభుత్వానికి వారధి

నవతెలంగాణ-కెరమెరి



పత్రికలు ప్రభుత్వానికి ప్రజలకు వారధని ఎస్సై గుంపుల విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మన తెలంగాణ 2025 క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలికి తీయడంలో పత్రికలు ప్రధాన పాత్ర పోషించాలని తెలిపారు. సమాజంలో నెలకొన్న సమస్యలను పాలకుల దృష్టికి తీసుకువచ్చేందుకు, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేరవేసేందుకు పత్రికలు పని చేస్తాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కేంద్రే చంద్రకాంత్, గోగర్ల బాలాజీ, కూటికెల వెంకటస్వామి, సంజీవ్, ఏజాజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భార్య ప్రవర్తన బాగాలేదని భర్త ఆత్మహత్య



నవతెలంగాణ-బెజ్జూర్

భార్య ప్రవర్తన బాగాలేదని భర్త పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గబ్బాయి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్ కథనం ప్రకారం.. అందుగులగూడ గ్రామానికి చెందిన కోర్తే ప్రకాష్(32) అతని భార్య కోర్తే లలిత ప్రవర్తన నచ్చక మనస్థాపం చెంది సోమవారం సాయంత్రం పురుగులమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు తలించాగ అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కొన్ని రోజులుగా గబ్బాయి గ్రామంలో ప్రకాష్ నివాసం ఉంటున్నాడు. కోర్తే లలిత ప్రవర్తన బాగాలేదని ఎన్నిసార్లు చెప్పినా, వినకపోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. తన సోదరుడు ప్రకాష్ మృతికి కారణమైన లలితపై కేసు నమోదు చేయాలని సోమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

విద్యార్థులు, యువతకు బాసటగా సింగరేణి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తే కాకుండా సమీప గ్రామాల అభివృద్ధితో పాటు విద్యార్థులు, యువత సంక్షేమం కోసం కృషి చేస్తుందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గోలేటిలోని సింగరేణి స్కూల్, సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంధాలయాన్ని సందర్శించారు. స్కూల్ గదుల మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని సివిల్ అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయులు స్కూల్‌లో కావాల్సిన వసతులు, సదుపాయాలను జీఎంకు వివరించారు. త్వరలోనే అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ విద్యా సంవత్సరం పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. అనంతరం గ్రంధాలయాన్ని పరిశీలించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న యువతీ, యువకులతో మాట్లాడి సౌకర్యాల వివరాలను తెలుసుకున్నారు. వసతులతో పాటు మరిన్ని కొత్త పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్ పాల్గొన్నారు.

ఔదార్యం చూపి..ఆర్థిక సాయం చేసి..



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిరుపేద కుటుంబానికి చెందిన స్నేహితుడు మృతి చెందితే అతని కుటుంబ సభ్యులను ఆదుకోవడానికి స్నేహితులు కలిసి ఆర్థిక సాయం అందజేసి స్నేహానికి ఉన్న విలువ చూపారు. ఆసిఫాబాద్ పట్టణంలోని తారక రామనగర్‌లో నివసిస్తున్న మల్లేష్(48) అనారోగ్యంతో గతేడాది నవంబర్‌లో మృతి చెందాడు. అతనికి తల్లి, భార్య, కుమార్తె ఉన్నారు. అతడు పట్టణంలో ఒక వ్యాపారి వద్ద పనులు నిర్వర్తించేవాడు. డొక్కడితే గాని రొక్కాడని పరిస్థితుల్లో మల్లేష్ మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న అతని చిన్ననాటి స్నేహితులు వారి కుటుంబ సభ్యులను ఆర్థికంగా ఆదుకునేందుకు అందరూ కలిసి జమ చేసిన రూ.15 వేలతో పాటు నెలకు సరిపడా సరకులను అందజేశారు. అదేవిధంగా అతని కుమార్తె చదువుల కోసం రూ. 44 వేల విలువగల బాండ్‌ను స్నేహితుని కుమార్తె పైన తీశామని, దానిని త్వరలో అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అతడి స్నేహితులతో పాటు స్థానికులు ప్రదీప్, రవీందర్, శ్రీధర్, శ్రీనివాస్ ఉన్నారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో టీయూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సీఐ రమేష్, ఎంఈఓ హన్మంతు, పీజీ హెచ్ఎంలు అరుణ్ కుమార్, నానాజీలు ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన బోధనలు చేయాలని ఈ సందర్భంగా అథితులు టీయూటీఎఫ్ సంఘ బాధ్యులకు సూచించారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. శ్యాంరావ్, ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు శివాజీ, సునీల్, సుధాకర్, సంజయ్, మహేష్, కవిత, తిరుపతి, వినోద్, రవి, విఠల్, రాకేష్, మిలింద్, ప్రశాంత్, సాయికుమార్, కృష్ణ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న రెండు సెల్ ఫోన్ల అప్పగింత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత జూలై, అక్టోబర్ నెలలో పోగొట్టుకున్న సెల్ ఫోన్లను ట్రేస్ అవుట్ చేసి బాధితులకు సీఐ రవీందర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ మిస్ అయినట్లు ఇద్దరు వ్యక్తులు మీనా, నందు కుమార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసినట్లు తెలిపారు. మొబైల్ ట్రేస్ అవుట్ చేయడంలో సిబ్బంది సహకరించినట్టు తెలిపారు.

జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలి

• సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మున్సిపల్ కార్మికులకు జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ భుజంగరావుకి సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ గ్రామపంచాయతీ మున్సిపల్‌గా ఏర్పడి దాదాపు 11 నెలలవుతున్న ఈ మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికులకు జీఓ నెంబర్ 60 ప్రకారంగా వేతనాలు చెల్లించాలని పది నెలల నుండి ఆందోళన చేస్తున్న ఇతర మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు ఉన్న సౌకర్యాలు ఆసిఫాబాద్ మున్సిపల్ కార్మికులకు వర్తింపచేయడం లేదన్నారు. కమిషనర్, కలెక్టర్‌కు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోలేదని, జీఓ నెంబర్ 60 ప్రకారంగా వేతనాలు ఇవ్వకుండా గ్రామపంచాయతీ కార్మికులు ఇచ్చే వేతనాలు ఇచ్చి కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్మికులకు జీఓ నెంబర్ 60 ప్రకారంగా వేతనాలు చెల్లించకుంటే 15 రోజుల తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామని, ఈ సమ్మెకు పూర్తిగా కలెక్టర్, కమిషనర్ బాధ్యత వహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్ల రాజు, సమ్మయ్య, శ్రీకాంత్, దుర్గ ప్రసాద్, ప్రభాకర్, లక్ష్మి, సంధ్య, పెంటుబాయి, పద్మ బాలేష్, ప్రభాకర్, జగదీష్, నరేష్, దుర్గయ్య శంకర్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలి

• కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆదర్శ క్రీడా పాఠశాల మైదానంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వసతి గృహాల ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పోటీలలో భాగంగా ప్రయివేట్ అథ్లెటిక్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విభాగాలలో వసతి గృహాల ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి పోటీలలో మెరుగైన ప్రతిభ కనబరచాలన్నారు. క్రీడలతో స్నేహభావం, గెలుపు ఓటములను సమానంగా తీసుకోవడం, ఏకాగ్రత పెరుగుతుందని, శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలని, క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో క్రీడా నైపుణ్యత ప్రదర్శించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సజీవన్, గిరిజన సంక్షేమ క్రీడల అధికారి మీనారెడ్డి, వసతి గృహాల సంక్షేమ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గడువులోగా వడ్లు కొనుగోలు పూర్తి చేయాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణయిత గడుపులోపు రైతుల నుంచి వడ్లు కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. మంగళవారం మండలంలోని లొనవెల్లీ గ్రామ పంచాయతీలోని దుబ్బగూడా గ్రామంలో వరి కొనుగోళ్ల కేంద్రాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు రోజులలో వరి కొనుగోళ్ల పూర్తి చేయాలని, ప్రభుత్వం నిర్ణయించిన తేదీలోపు రైతులకు ఎలాంటి ఇబ్బందులు, నష్టపోకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ రాజ్ కుమార్, ఏపీఎంలు శ్రీనివాస్, దుర్గయ్య, సీసీ రాజేష్, రైతులు పాల్గొన్నారు.

దహెగాం : మూడు రోజుల్లో కొనుగోళ్ల పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఐనం, లగ్గమ గ్రామాల్లో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో వారం రోజుల్లో ధాన్యాన్ని తరలించాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా ధాన్యం కొనుగోళు పూర్తి చేయడంతో రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీసీఓ బిక్కునాయక్, తహసిల్దార్ కవిత, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్, ఇన్‌చార్జీ సీఈఓ నారాయణ, ఏఈఓ వంశీ ఉన్నారు.



సివిల్ సప్లయి హమాలీల సమ్మె విరమణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సివిల్ సప్లయి హమాలీల సమ్మె విరమిస్తున్నట్టు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దివాకర్, బోగే ఉపేందర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లయి జీసీసీ హమాలీ కార్మికుల ఎగుమతి, దిగుమతి హమాలీ రేట్ల ఒప్పందం అమలు చేస్తూ జీఓ విడుదల చేయాలని, జనవరి 1 నుండి ఈ రోజు వరకు 7 రోజులు జరిగిన రాష్ట్ర వ్యాపితంగా సమ్మెను కొనసాగిస్తుండగా ఎర్రమంజిలోని జలసౌధ ఇరిగేషన్ శాఖ రాష్ట్ర కార్యాలయంలో మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డిని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ తదితరులతో కూడిన ప్రతినిధి బృందంతో జరిగిన సమావేశంలో అక్టోబర్ 4న జరిగిన వేతన ఒప్పందం ప్రకారం హమాలీ రేట్లను పెంచి అమలు చేయాలని చాడ వెంకట్ రెడ్డి మంత్రికి వివరించగా సానుకూలంగా స్పందిస్తూ 2 రోజుల్లో జీఓను విడుదల చేస్తామని దానికి అనుగుణంగా సమ్మెను విరమించాలని కోరగా దానికి అంగీకరించినట్టు తెలిపారు. సమ్మెను విరమిస్తున్నట్టు తెలిపారు.

పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

• టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి డిమాండ్ చేవారు. మండలంలోని జడ్పీపీఎస్ హైస్కూల్‌లో హెచ్ఎం సదాశివుడుతో నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ డీఏలు, పీఆర్సీపై స్పందించాలన్నారు. 317 చీకటి జీఓ ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారి స్థానిక జిల్లాలకు దశలవారీగా పంపించి నష్టపోయిన వారికి న్యాయం చేయాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో ప్రభుత్వ విద్య కార్పోరేట్, కాషాయీకరణ దిశగా ప్రభుత్వాలు తీసుకెళ్లడం సరికాదని వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరీష్, భాజిఖాన్, మండల బాధ్యులు సాయి, యుగంధర్, తేజస్వరి, హరీష్, తిరుపతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు పండ్లు పంపిణీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాలతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు విద్యార్థులకు పండ్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికలు, బాలురు, ఉర్దూ పాఠశాలలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పంపిణీ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్ మాట్లాడుతూ రానున్న పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను ఉత్తమ స్థాయిలో నిలిచేలా చూడాలని ఉపాధ్యాయులను కోరారు. విద్యార్థులకు ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక తరగతులు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రత్యేక తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు మహ్మద్ జామీర్ అహ్మద్, మొహమ్మద్ బబ్లూ, హరీష్, కిరణ్ పాల్గొన్నారు.

గుండి గ్రామంలో..

మండలంలోని గుండి గ్రామంలో ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పండ్లు పంపిణీ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిబాటలో భాగంగా విద్యార్థులకు ఉత్సాహాన్ని కలిగించే ఉద్దేశంతో పండ్లు పంపిణీ చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గుండి మాజీ సర్పంచ్ సెండే దత్తు, పాఠశాల కమిటీ చైర్మన్ స్వప్న సుభాష్ చారి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దానిపెల్లి శ్యామ్‌రావు, గ్రామ పటేల్ రాజుపటేల్, నాయకులు బట్టుపెల్లి కమలాకరచారి, విశ్వనాథ్, తిరుమల, సత్తయ్య, మాజీ వార్డ్ మెంబర్ రఘునాథ్, ఈశ్వరచారి, పోచన్న, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సెపక్ తక్రాకు గోలేటి క్రీడాకారులు

నవతెలంగాణ-రెబ్బెన

ఈ నెల 10 నుండి 14 వరకు హన్మాకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే 34వ సీనియర్ జాతీయ స్థాయి సెపక్ తక్రా టోర్నమెంట్‌కు గోలేటి క్రీడాకారులు ఎంపికయ్యారు. పురుషుల జట్టుకు ఆర్.వెంకటేష్, ఆడే.రాజేందర్, పులిపాక. రాజశేఖర్ మహిళా జట్టుకు కే.శ్రీస్ఫూర్తి కారుణ్య, ఆర్.విష్ణు ప్రియ ఎంపికైనట్లు తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా ఒలింపిక్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.నారాయణ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా సంయుక్త కార్యదర్శి పి.శిరీష, ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ కె.భాస్కర్, ఆర్.రామకృష్ణ, కె.మల్లేష్, తెలంగాణ రాష్ట్ర బాల్ బాడ్మింటన్ సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉమ్మడి జిల్లా సెపక్ తక్రా జిల్లా కార్యవర్గం మహేందర్ రెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, సతీష్, పి.సాంబయ్య, జి.మల్లేష్, ఎల్.హరిలాల్, జి.శ్రీధర్, జి అనిల్ గౌడ్ అభినందనలు తెలిపారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

గిరిజనుల ఆర్థిక సంక్షేమానికి అటవీ శాఖ ఆధ్వర్యంలో అవసరమైన కృషి చేస్తున్నట్టు కాగజ్‌నగర్ ఎఫ్‌డీఓ సుశాంత్ సుఖాడే అన్నారు. మంగళవారం సిర్పూర్ రేంజ్ పరిధిలోని పూసుగూడ, రావన్‌పల్లి, మేడ్‌పల్లి గ్రామాల్లో నిరుపేద గిరిజనులకు అటవీ శాఖ కమ్యూనిటీ విశ్వాస నిర్మాణం పేరుతో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. ప్రజలు అటవీ శాఖపై నమ్మకం ఉంచి అటవీ సంరక్షణలో కలిసి రావాలని కోరారు. అడవి ప్రాంతంలో నిప్పు అంటించకూడదని, వన్యప్రాణుల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి ఇక్బాల్ హుస్సేన్, సిబ్బంది, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

జ్యోతిబాఫూలే నేషనల్ అవార్డు గ్రహీతకు సన్మానం



నవతెలంగాణ-కౌటాల

మహాత్మా జ్యోతిబా పూలే జాతీయ అవార్డు అందుకున్న గుర్లె శ్రీనివాస్‌ను మంగళవారం మండల కేంద్రంలో మహాత్మ జ్యోతిబా పూలే సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. చింతలమానేపల్లి మండలం డబ్బా బారెగూడ గ్రామానికి చెందిన గుర్లె శ్రీనివాస్ శ్రీశివరామసాయి యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చేసిన సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. దీన్ని గుర్తించి 2025 సంవత్సరానికి గాను ఈ నెల5న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ 7వ తెలంగాణ రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, మేజిస్ట్రేట్ జస్టిస్ ఈశ్వరయ్య శాలువాతో సన్మానించి, మహాత్మా జ్యోతిబా పూలే జాతీయ అవార్డును అందించారు. ఈ సందర్భంగా ఆయన్ను మాలీ సంఘం తరఫున సన్మానించారు. కార్యక్రమంలో మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అభ్యర్థి ఆదే వసంత్ రావు, జిల్లా అధ్యక్ష అభ్యర్థి ఆదే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నికోడే గంగారం, నాయకులు మొర్లె పాండురంగ్, సెండే ముక్తేశ్వర్, రమేష్, బాపురావు, జ్యోతిరావు పాల్గొన్నారు

నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-లక్సెట్టిపేట



నవతెలంగాణ 2024 నూతన క్యాలెండర్‌ను ఎంపీడీవో కె.సరోజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నేటి సమాజంలో పత్రికల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రభుత్వాలకు, ప్రజలకు వారధిగా ఉంటూ, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆఫీస్ సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చైనా మాంజా అమ్మితే ఏడేండ్లు జైలు

నవతెలంగాణ-జన్నారం

చైనా మాంజాపై రాష్ట్ర ప్రభుత్వం నిషేదం విధించిందని, పర్యా వరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం మాంజా అమ్మినా, కొనుగోలు చేసినా నేరమే అవుతుందని, ఏడేండ్లు జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తారని సీఐ శ్రీనివాస్ తెలిపారు. సర్కిల్లోని ఏ షాపుల్లోనైనా చైనా మాంజాను విక్రయించరా దని తెలిపారు. నైలాన్, సింతటిక్ దారాలతో తయారు చేసే ఈ చైనా మాంజాలతో పర్యావరణానికి విపత్తు కావడంతో జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు చైనా మాంజా వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని ఎట్టి పరిస్థితుల్లో విక్ర యించరాదన్నారు. అదే విధంగా ప్రజలు సైతం చైనా మాంజా వినియోగించకుండా ఎవరికి హానీ కలగని సాధారణ దారంతో గాలిపటాలను ఎగరవేసుకోవాలన్నారు. ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా డయల్ 100కు ఫో న్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. వచ్చే సంక్రాంతి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు.

చేరువ కానున్న వైద్య సేవలు

● అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే వివేక్



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ మున్సిపాల్టీ పరిధిలో ఏర్పాటు చేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం రూ. కోటి 43 లక్షలతో ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం కోటపల్లి మండల పరిధిలో రూ. కోటి 10 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. నియోజకవర్గం పరిధిలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. పనులకు ఆటంకమైన అనుమతుల కోసం సంబంధిత కేంద్ర మంత్రిని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణతో కలిసినట్లు తెలిపారు. అటవీ అనుమతులు అందిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కోటపల్లి మండల పరిధిలో గల వివిధ గ్రామాలకు సంబంధించి 10 సీసీ రోడ్లు, 12 డ్రైనేజీలు నిర్మించనున్నామని తెలిపారు. నక్కలపల్లి సమీపంలో గల లోతువాగుపై రూ.15 లక్షలతో నిర్మించిన లోలెవల్ వంతెనను కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ప్రారంభించారు. నక్కలపల్లి గ్రామానికి సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలిపిన ఆయన రహదారి నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు చేయిస్తామని అన్నారు. కాగా కోటపల్లి మండలానికి వచ్చిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి మండల ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. డప్పు చప్పులతో ర్యాలీ నిర్వహించిన అనంతరం స్థానికంగా ఉన్నటువంటి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిధి అధికారులతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సింగరేణి యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలి

నవతెలంగాణ-తాండూర్



సంస్కరణల పేరుతో కార్మికులకు సౌకర్యాలను దూరం చేస్తున్న సింగరేణి యాజమాన్యం మొండివైఖరి విడనాడాలని సింగరేణి రిటైర్డ్ కార్మికులు ప్రజలు నినాదాలు చేశారు. మంగళవారం కన్నాల బస్తీ టేకుల బస్తి ప్రజలు మాజీ సింగరేణి కార్మికుల నివాసాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేసినందుకు నిరసనగా మార్కెట్ రోడ్డు వద్ద రోడ్డుపై బైఠాయించారు. యాజమాన్యం ఉచితంగా విద్యుత్తు సరఫరా చేయాలని నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి ఉచితంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి అప్పగించిన సింగరేణి క్వార్టర్లకు యజమాన్యం విద్యుత్తు నిలిపివేయండంతో బాధిత బస్తీల ప్రజలు, నాయకులు ఒకటై యజమాన్యం వైఖిరిని నిరసిస్తూ రాస్తారోకో చేపట్టారు. సింగరేణి అధికారులు తీరుపై మండిపడ్డారు. తన ఉద్యోగ జీవితకాలం సింగరేణి అభివృద్ధి కోసం పాటుపడిన రిటైర్డ్ కార్మిక కుటుంబాలకు యజమాన్యం విద్యుత్ నిలిపివేయడం అమానుషమని మాజీ కౌన్సిలర్ పొట్ల సురేష్ ఆరోపించారు. యాంత్రికరణ లేని రోజుల్లో మా తండ్రులు కాగడాలు దివిటీలతో భూగర్భ గనుల్లో విధులు నిర్వహించి బొగ్గు వెలికి తీసి సింగరేణి మనుగడకు తోడ్పడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తొంగల మల్లేష్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆకుల సత్యనారాయణ, రిటైర్డ్ కార్మికులు కే మల్లయ్య, ఎం జగన్, లింగయ్య, పి మల్లక్క, ఏ స్వప్న, బి రాజేశ్వరి, జి రామ్నాథ్, పి అనిల్, ఎస్ శంకర్, సమ్మన్న పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యానికి ఇదే కీలక సమయం

● ఐకే ఓసీని సంధర్శించిన డైరెక్టర్

నవతెలంగాణ-జైపూర్



2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి లక్ష్య సాధనకు మిగిలి ఉన్న ఈ మూడు నెలల సమయం అత్యంత కీలకమని సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఎల్వీ సూర్యనారాయణతో కలిసి ఇందారం ఓపన్‌కాస్ట్ గనిని సందర్శించారు. నేరుగా పని స్థలాలను పరిశీలించిన ఆయన ఈ ఏడాది నిర్దేషిత లక్ష్యాలను అధిగమించడం కోసం ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఇందారం ఓసీ ప్లాన్ పరిశీలించిన ఆయన అధికారులతో చర్చించడంతో పాటు గని క్వారీలో కోల్ బెంచ్, ఆఫ్ లోడింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఉత్పత్తి పెంపుకు తగిన సూచనలు చేశారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని అందుకు అనుగుణగా ముందుకు వెళ్లాలని తెలిపారు. అదేవిధంగా నిర్దేషిత ఓబీ తరలింపుకు సంబందించిన అవసరమైన ఏర్పాటు చేసుకోవాలని కాంట్రాక్టు కంపెనీకి సూచించారు. ఆర్థిక సంవత్సరానికి నిర్దేషిత బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత సాధించడంలో ముందుండాలని కోరారు. కార్యక్రమంలో ఇందారం ఓపన్‌కాస్ట్ గని ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్టు ఇంజనీర్ రామకృష్ణారావు, సేఫ్టీ ఆఫీసర్ సతీష్ పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరే వరకు పోరాటం

నవతెలంగాణ-నస్పూర్



ఎస్ఆర్పీ-3 గని గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న తుమ్మల రాజారెడిడ్డి

సింగరేణి కార్మికుల చిరకాల స్వప్నమైన సొంతింటి కల నెరవేరేంత వరకు పోరాడుతూనే ఉంటామని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా లోని ఎస్ఆర్పీ-3 గనిలో ఆర్గనైజర్ వెంగళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగులో పాల్గొని మాట్లాడారు. గెలిచిన, ప్రాతినిధ్య సంఘాలకు కార్మికులపై చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కార్మికులకు సొంతింటి కల నెరవేర్చడం కార్మికులకు, యాజమాన్యానికి, ప్రభుత్వానికి కలిగే లాభాలను కులంకషంగా వివరించారు. గతంలోని కోల్ ఇండియాలో పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్‌ను రద్దు చేశాయని, అధికారులకు చేసినట్టుగానే కార్మికులకు కూడా ఇన్కమ్ టాక్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికుల ప్రధాన సమస్య అయినా మారుపేర్లపై గెలిచిన, ప్రాతినిధ్య సంఘాలు స్పందించకపోవడం అమానుష్యమన్నారు. కార్మికుల సమస్యలు పరిస్కారం చేస్తామని మేనిఫెస్టోలో పెట్టుకుని గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు స్ట్రక్చర్ మీటింగ్‌లో ఆ ఊసే ఎత్తకుండా కార్మికులను మోసం చేస్తున్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రిని సైతం కలిశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధ్యక్షుడు గుల్ల బాలాజీ, ట్రెజరర్ కస్తూరి చంద్రశేఖర్, మందమర్రి బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి, ఆర్జీ-1 అధ్యక్షుడు రాజమౌళి, బ్రాంచ్ నాయకులు బోడకుంట శంకర్, చీకట్ల సాగర్, శ్రీపతి బానేష్, పేరుక సదానందం, మేల్లం శ్రీధర్, శైల శ్రీనివాస్, నరహరి, వెంకట్‌రెడ్డి, ఆషాడం రమేష్, మాదాసు విజయ్, ప్రతాప్, ఇతినేని వెంకటేష్, పల్లె రాకేష్, కేసిపెద్ది శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళితుల భూములు లాక్కుంటే సహించం



● ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-హాజీపూర్

రాష్ట్ర ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కు కోసం దళితుల భూములను లాకునే ప్రయత్నం చేస్తుందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. భూ నిర్వాసితులకు మద్దతుగా నిలుస్తామని వారిని ఆయన కలిశారు. హాజీపూర్ మండలం ముల్కల, వేంపల్లిలో ఇండస్ట్రియల్ పార్కు కోసం సుమారు 276 ఎకరాల భూమిని సేకరరించేందుకు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు అనుచరులు గ్రామాలలోని దళితులను బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి నోటీసులు, జీఓ లేకుండా ఎస్సీ, బీసీ సామాజిక వర్గాల ప్రజల సాగు భూములను గుంజుకుంటే బీఆర్ఎస్ ఊరుకోదని అన్నారు. కాంగ్రెస్ నాయకుల భూములలో ఇండస్ట్రియల్ పార్కు నిర్మించాలని, పేద దళితులు సాగు భూములలో ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పాలనలో ఎస్సీలపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని, మంచిర్యాల స్థానిక ఎమ్మెల్యే తీరు మార్చుకోవాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ తన హయాంలో వేంపల్లిలోని నిరుపేద దళితులకు ఒక్కో కుటుంబానికి 20 గంటల భూమి ఇప్పించానని తెలిపారు. ఏండ్లుగా సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారాన్నారు. ఇపుడు ఆ భూములు విలువ మార్కెట్ ధర ప్రకారం ఎకరాకు. రూ.50 లక్షలపై బడే ఉందన్నారు. ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో ఎకరాకు రూ.13.50 లక్షల వాల్యూ ఏ విధంగా ఇస్తారని ప్రశ్నించారు. తక్కువ ధరకు దళితుల భూములు లాక్కునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విజిత్ రావు, సందేల వెంకటేష్, రవీందర్‌రెడ్డి, అంకం నరేష్, సాగి వెంకటేశ్వర్‌రావు, మంచాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్‌ను నమ్మొద్దు

● బీఆర్ఎస్ నాయకుల బైక్ ర్యాలీ

నవతెలంగాణ-జైపూర్



వ్యవసాయానికి పెట్టుబడి సాయం రైతు భరోసా పథకం ద్వార ఎకరాకు రూ.15 వేల చొప్పున చెల్లిస్తామని మోసం చేసిన కాంగ్రెస్‌ను నమ్మొద్దని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజా రమేష్ అన్నారు. మంగళవారం స్థానిక నాయకులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఎకరా ఒకంటి రూ.15 వేలు, కౌలు రైతులకు రూ.15 వేల ఆర్థిక తోడ్పాటు అందిస్తామని అబద్దపు ప్రచారంతో కాంగ్రెస్ అదికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టి 13 నెలలు కావస్తున్నా యాసంగి పంటకు రూ.5 వేల చొప్పున ఇచ్చి మొదటి రెండు సీజన్లకు సంబంధించిన మొత్తం ఎగ్గొట్టిందని అన్నారు. ఈ లెక్కన తెలంగాణ రాష్ట్రంలో రైతులకు రూ. 17,500 చొప్పున బాకీ పడిందని విమ్మర్శించారు.. కాగా బీఆర్ఎస్ రైతుల పక్షాన ఉంటుందని, తెలంగాణ ప్రజల హక్కుల కోసం పోరాడుతుందన్న విషయాన్ని తెలంగాణ ప్రజలు మర్చిపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మేడి సునిత తిరుపతి, జగన్ గౌడ్, గట్టయ్య, శ్రీకాంత్, వెంకటస్వామి, ధర్మయ్య, రాపల్లి సత్తయ్య, చెన్నుభాయ్, సురేష్, శేఖర్, తుంగపిండి శ్రీనివాస్, మల్లేష్, యూత్ నాయకులు ఆకుల సాయి, సతీష్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలే కీలకం

● మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి



నవతెలంగాణ-మందమర్రి

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలది ప్రముఖ పాత్ర అని మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున మందమర్రి అంగడి బజారు ప్రాంతంలో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా కాలనీలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి పత్రాలు లేని 34 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత పోలీసుల బాధ్యత అని, కాలనీలో కొత్త వ్యక్తులు, నేరస్తులు, షెల్టర్ తీసుకుని ఉన్నట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. యువత చెడు అలవాట్లకు గంజాయి, డ్రగ్స్ లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. అనుమానాస్పద ప్రదేశాలలో నార్కోటిక్ డాగ్‌తో పరిశీలించారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని లేదా 100 నెంబర్‌కి కాల్ చేసి తెలుపాలని సూచించారు. మోసగాళ్ల ఫోన్ కాల్స్, మెసెజ్, వాట్సాప్ కాల్స్‌కు స్పందించవద్దని అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కాలనీలో స్వీయ రక్షణకు పోలీసుల సహకారంతో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని, భద్రతా పరమైన అంశాలలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. గంజాయి విక్రయించినా రవాణా చేసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు.

10 లీటర్ల గుడుంబా పట్టివేత

తనిఖీలలో అంగడి బజారుకు చెందిన మహిళ గృహంలో 5 లీటర్ల గుడుంబా గుర్తించి కేసు నమోదు చేశారు. గూడెంకు చెందిన మరో వ్యక్తి అంగడి బజారు ప్రాంతానికి గుడుంబా అమ్మడానికి రాగా అతని దగ్గర నుండి 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సార్ ప్లీజ్..ఒక్క సెల్ఫీ..!

నవతెలంగాణ-జైపూర్



ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో ఒకావిడ సెల్ఫీ దిగాలని ఉత్సాహ పడింది. ప్రయివేటు పాఠశాల ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఆమె మంగళవారం చెన్నూర్ వైపు వెలుతున్న ఎమ్మెల్యే వాహనాన్ని ఆపింది. సార్ ప్లీజ్ ఒక సెల్ఫీ ఇవ్వాలని కోరగా ఆమెకు తన పట్ల ఉన్న అభిమానానికి సెల్ఫీకి బదులుగా ఆమె ఇద్దరు పిల్లలతో కలిసి ఫోటో దిగి ఆమెను సంతృప్తి పర్చారు. నియోజవకర్గంలో అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు మంచిర్యాల నుంచి చెన్నూర్ వైపు పోలీస్ ఎస్కాట్‌తో వెలుతున్న ఎమ్మెల్యే కారును ఆపిన ఆమె పోలంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోగల పేర్లాఫ్ ఇండియా ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది.

బాధితుడికి బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-లక్సెట్టిపేట



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాధితుడికి పోస్టల్ ప్రమాద బీమా చెక్కును మంగళవారం పోస్టల్ శాఖ అధికారులు అందజేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన రత్నం అశోక్ అనే యువకుడు పోస్టల్ శాఖలో టాటా ఏఐజీ ప్రమాద బీమా పాలసీకి ధరఖాస్తు చేసుకున్నాడు. గత నవంబర్ 18వ తేదీన దొనబండ పెట్రోల్ బంకు సమీపంలో ప్రమాదవశాత్తు అశోక్‌కి రోడ్డు ప్రమాదం జరిగి తీవ్రంగా గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొంది పూర్తిగా కోలుకున్నాడు. అతనికి మంజూరైన రూ.లక్ష ప్రమాద బీమా చెక్కు, పూర్తి పరిహారాన్ని గుల్ల కోట పోస్టాఫీసు వద్ద పోస్టల్ అధికారులు, సిబ్బంది బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ అధికారి రాథోడ్ రామారావు, మాజీ సర్పంచ్ గొల్ల రవీందర్, సీనియర్ మేనేజర్ వెంకట స్వామి, మేనేజర్ సాగర్, గుల్లకోట బీపీఎం తిరుపతిరెడ్డి, ఎస్పీఎం, సుప్రియ పాల్గొన్నారు.

మండల స్థాయి క్రికెట్ పోటీలు

నవతెలంగాణ-తాండూర్

సంక్రాంతి పండగ సందర్భంగా శుక్రవారం నుంచి మాదారం ఎల్బీ స్టేడియంలో తాండూర్ మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు మాదారం యూత్ అసోసియేన్ నాయకులు తెలిపారు. మండలంలోని క్రికెట్ క్రీడాకారులు టోర్నమెంట్ లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోటీల్లో పాల్గొనే టీములకు రూ.1100 ఎంట్రీ ఫీజు నిర్ణయించినట్లు వివరించారు. గెలుపొందిన జట్లకు వరుసగా వేయి, 2 వేల ప్రథమ ద్వితీయ ప్రోత్సాహకాలను అందించనున్నట్లు తెలిపారు. ఏ గ్రామపంచాయతీ క్రీడాకారులు ఆయా గ్రామపంచాయతీ టీమ్ లోనే ఆడాలని తెలిపారు. ఒక టీంలో ఆడిన క్రీడాకారుడు వేరొక టీంలో ఆడకూడదని వివరించారు. మరిన్ని వివరాలకకు సాగర్ 8008470147 అఖిల్-7569944578 సంప్రదించాలని కోరారు.

కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలకు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కిష్టాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ప్రత్యేక బోధన అందించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు గాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌వైబీఐజెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మాదాపూర్ హైటెక్ సిటీ లోని నోవాటెల్ హోటల్ ఉత్తమ పాఠశాలగా అవార్డు తీసుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న తెలిపారు. ఈ అవార్డును రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ డైరెక్టర్ రాధారెడ్డి, పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్ వెంకటనర్సమ్మ హైబిజ్.టీవీ డైరెక్టర్ రాజగోపాల్, మల్లారెడ్డి విద్యాసంస్థల డైరెక్టర్ ప్రీతిరెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ చేతుల మీదుగా ఎడ్యుకేషనల్ ఎక్సలెంట్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును తనతోపాటు ఉపాధ్యాయులు దాముగా కరుణాకర్, జాడి మురళీ అందుకున్నారు.

జాతీయ భద్రత ఉత్సవాలు

నవతెలంగాణ-తాండూర్

మండల కేంద్రంలో మంగళవారం జాతియ రహదారి భద్రత మాసోత్సవాలల్లో బాగంగా రాష్ట్ర రవాణా శాఖ అద్వర్యంలో జిల్లా రవాణా శాఖ అధికారులు రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. టూ వీలర్స్ ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాల గురించి తెలిపారు. అతివేగం ప్రమాదకరమని తెలిపారు. మత్తుపానీయాలు సేవించి వాహనాలు నడపకూడదన్నారు. రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు ఖాసిం సాహెబ్, సూర్యతేజ, హోంగార్డు రమేష్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-జన్నారం

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు ఇంధన్‌పెల్లి ఎఫ్ఆర్ఓ కారం శ్రీనివాస్ తెలిపారు. ఇంధన్‌పెల్లి రేంజ్ పరిధిలోని మల్లాపూర్ నుంచి అక్రమంగా ఇసుక తీసుకొని వెళ్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కార్యాలయానికి తరలించామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులకు క్యాలెండర్ పంపిణీ

నవతెలంగాణ-జైపూర్



సింగరేణి వ్యాప్తంగా ఉన్నటువంటి 42 మంది ఉద్యోగులకు సింగరేణి క్యాలండర్ పంపిణీ చేయనున్నట్లు సీఎండీ ఎన్ బలరామ్ నాయక్ తెలిపారు. మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు చేతుల మీదుగా హైదరాబాద్‌లో సింగరేణి క్యాలండర్ ఆవిష్కరించారు. సింగరేణి సంస్థ విశిష్టత, సంస్థ సాధిస్తున్న ప్రగతి, చేపడుతున్న అభివృద్ధి ప్రతిబింబించేలా క్యాలండర్ రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సీఎం కోఆర్డినేషన్, చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎస్డీ సుభానితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న కలప పట్టివేత

నవతెలంగాణ-జన్నారం



కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని ఇంధన్‌పల్లి రేంజ్ ఇస్లాంపుర గ్రామం వద్ద మంగళవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న టేకు కలపను పట్టుకున్నట్లు ఎఫ్ఆర్ఓ కారం శ్రీనివాస్ తెలిపారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సందర్భంలో ఇస్లాంపుర గ్రామానికి చెందిన కొందరు ద్విచక్ర వాహనంపై విలువైన టేకు కర్ర తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. పట్టుకున్న ఆ టేకు కర్ర విలువ రూ.29,134 ఉంటుందన్నారు. ద్విచక్ర వాహనంతో సహా టేకు కలపను కార్యాలయాన్ని తరళించామన్నారు.

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి

నవతెలంగాణ-కెరమెరి



ఉపాధ్యాయులు సమయ పాటించాలని మండల విద్యాధికారి ఆడే ప్రకాష్ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఉపాధ్యాయులకు పాఠశాలల సముదాయ సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని 50శాతం మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ప్రతి పాఠశాలలో పూర్తైన ఎఫ్ఏ 1, 2, 3, ఎస్ఏ 1 పరీక్షల ఫలితాలు విద్యార్థులు సాధించిన సామర్థ్యాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకూడదన్నారు. విద్యార్థుల విద్యాభి వృద్ధికి కృషి చేయాలన్నారు. ఇందులో ఆర్పీలు నరేష్, సురేష్, వినీత్ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు అమర్చిన ముగ్గురి రిమాండ్

నవతెలంగాణ-బెజ్జూర్



వన్యప్రాణుల కోసం విద్యుత్ తీగల మరిచిన ముగ్గురు వ్యక్తులను మంగళవారం రిమాండ్‌కు పంపించామని బెజ్జూర్ రేంజ్ అధికారి ముసవీర్ తెలిపారు. బెజ్జూర్ రేంజ్ పరిధిలోని ఏటిగూడ గ్రామ సమీపంలో రిజర్వ్ అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల కోసం ఏటి గూడెం గ్రామానికి చెందిన మడే ప్రభాకర్, తుమ్మల మహేష్, జక్కం వినోద్ కుమార్ విద్యుత్ అమరుస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్స్ రూల్స్ తెలుసుకోవాలి



నవతెలంగాణ-కౌటాల

విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాల గురించి తెలుసుకోవాలని ఏఎంవీఐ విక్రమ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నిబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదలు జరిగే తీరు నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదలు అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వాహనంపై ఇంటి నుంచి బయటకు వెళ్లే తిరిగి వచ్చే వరకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఉందన్నారు. రోడ్డు భద్రత నియమాలు తెలియక పోవడంతో ప్రమాదలు అధికంగా జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు వాటి గురించి తెలుసుకుంటు ఇతరులకు తెలియజేస్తూ ప్రమాదల నివారణకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలకిషన్, కానిస్టేబుల్ రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని కోసర గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించే అంగన్‌వాడీ భవనానికి సింగిల్ విండో చైర్మన్ అలి బిన్ అహ్మద్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణాలతో విద్యార్థులకు సౌకర్యాలు మెరుగయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పున్నుందాస్, కౌటగూడా మాజీ సర్పంచ్ లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ మల్లేష్, గ్రామస్తులు దస్రు, లక్ష్మణ్, గణేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఏటీఏ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కౌటాల

మండల విద్యా వనరుల కేంద్రంలో ఏటీఏ క్యాలెండర్‌ను ఎంఈఓ గావుడే హన్మంతు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి, నాణ్యమైన విద్యను అందించి వారి సంపూర్ణ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు సమయపాలన పాటిస్తూ, క్రమశిక్షణతో నాణ్యమైన బోధన అందిస్తూ, భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కౌటాల మండల విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఒక సామాజిక స్పృహ కలిగిన సంఘంగా నూతన సంవత్సరంలో నవ ఉత్తేజంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల తిరుపతి, మండల అధ్యక్షులు మడావి పోచని, ప్రధాన కార్యదర్శి పెందుర్ అశోక్, ఉపాధ్యాయులు కుమ్మరం అంతయ్య, ఆత్రం దేవయ్య, ఆత్రం శ్యామ్‌రావు, మడే రాములు, ఎర్మ జలపతి, సోయం సంతోష్, పోరెతే ప్రదీప్, నైతం ఆనంద్ రావు, మడావి రవీందర్, సెడ్మక సదాశివ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-రెబ్బెన

ఎమ్మార్పీఎస్ సంస్థాగత నిర్మాణం బలోపేతం చేయడంలో భాగంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గోలేటి గ్రామంలో నిర్వహించిన మండల సదస్సులో రాష్ట్ర అధికార ప్రతినిధి పాల్గొని నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం అమలు కోసం ఫిబ్రవరి 07న చలో హైదరాబాద్ వెయ్యి గొంతులు లక్ష డప్పుల ప్రదర్శన విజయవంతం చేయాలన్నారు. జిల్లా కమిటీలో భాగంగా యువ నాయకులుగా జంగంపెల్లి రాజేష్, జిల్లా కార్యకర్తగా దుర్గం రాకేశ్, రెబ్బెన మండల అధ్యక్షులుగా ఇప్ప నవీన్, ఉపాధ్యక్షుడిగా దుర్గం అనిల్, ప్రధాన కార్యదర్శిగా దుర్గం రాజ్ కుమార్, అధికార ప్రతినిధి నక్క కిరణ్, గోలేటి గ్రామ కమిటీలో భాగంగా గౌరవ అధ్యక్షుడిగా దుర్గం జనార్ధన్, ఇగురపు రాజశేఖర్, గ్రామ ఉపాధ్యక్షులు నక్క ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి దూడల దశరథ్, పోగుల నవీన్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చెన్నూరు సమ్మయ్య, బెల్లంపల్లి మండల అధ్యక్షుడు మహేష్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల సమ్మె విరమణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

గత ఏడు రోజులుగా చేపడుతున్న సివిల్ సప్లై, జీసీసీ హమాలీ కార్మికుల సమ్మెను మంగళవారం విరమించినట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం కాగజ్‌నగర్ పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో హమాలీ కార్మికులు సమ్మె చేపడుతున్న విషయం తెల్సిందే. ఈ సమ్మెను మంగళవారం విరమించారు. హైద్రాబాద్‌లో మంగళవారం పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యులు చాడ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్ తదితరులతో కూడిన ప్రతినిధి బృందం కలిసి హమాలీ కార్మికుల సమస్యలపై చర్చించినట్లు బోగె ఉపేందర్ తెలిపారు. గతేడాది అక్టోబర్‌లో జరిగిన వేతన ఒప్పందం ప్రకారం హమాలీ రేట్లను పెంచుతూ రెండు రోజులలో జీఓను విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేస్తామని, సమ్మె విరమించాలని మంత్రి సూచన మేరకు సమ్మె విరమించినట్లు తెలిపారు.

వేతనాల కోసం మళ్లీ ఆందోళన

- మున్సిపల్ కార్యాలయం ముందు పికెటింగ్ చేపట్టిన కార్మికులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు తమకు రావాల్సిన వేతనాల కోసం మళ్లీ ఆందోళన బాట పట్టారు. గత నాలుగు నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో మంగళవారం వారు సీఐటీయూ అనుబంధ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు పికెటింగ్ చేపట్టారు. ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు పికెటింగ్ చేపట్టడంతో కమిషనర్‌తో పాటు సిబ్బంది కార్యాలయం బయటే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి స్టాంప్ డ్యూటీ డబ్బులు సుమారు 2.05 కోట్లు రాగా అందులో నుండి కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు నిర్ణయించి ఈ విషయాన్ని కమిషనర్ అంజయ్య కార్మికులకు వివరించారు. వేతనాలు చెల్లించగా మిగిలిన మొత్తాన్ని ఈఎస్ఐ, పీఎఫ్ ఖాతాలలో జమ చేస్తామని మున్సిపల్ కమిషనర్ హామీ ఇవ్వడంతో కార్మికులు పికెటింగ్ విరమించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శంకర్, సంజీవ్ మాట్లాడుతూ గతేడాది సెప్టెంబర్ నుండి వేతనాలు రావాల్సి ఉందని, సంక్రాంతి పండుగ సమీపిస్తున్నా ఇప్పటి వరకు వేతనాలు చెల్లించకపోవడంతో తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కాగా వీరి ఆందోళనకు బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ నాయకులు అంబాల ఓదేలు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎం జయదేవ్ అబ్రహం, ఉపాధ్యక్షులు బి నర్సయ్య, ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు అల్లి రాజయ్య, మహబూబ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఓదేలు మాట్లాడుతూ మున్సిపల్ పాలన అస్తవ్యస్తంగా ఉందని, ఈ కారణంగానే కార్మికులకు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉంటున్నాయని అన్నారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు శంకరమ్మ, రమేష్, మల్లేష్, మధు, శేఖర్, అశోక్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె తాత్కాలిక వాయిదా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టివిక్ర మార్కతో సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలపై చర్చలు సఫలం కావడంతో సమ్మె తాత్కాలిక వాయిదా వేస్తున్నట్లు జిల్లా అధ్యక్షురాలు శృతిక తెలిపారు. సమ్మె విరమణకు సంబంధించి పత్రాన్ని జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ గమీనియల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పే స్కేల్ అమలు గురించి కేబినెట్ సబ్ కమిటీ తొందరలోనే నిర్ణయం తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి తెలిపారన్నారు. మిగిలిన అంశాలు వెంటనే విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కి పంపించి ఆమోదయోగ్యం తెలుపుతామని హామీ ఇచ్చినట్లు వివరించారు. ప్రభుత్వంపై నమ్మకం ఉంచి సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు తెలిపారు. 28 రోజులుగా చేస్తున్న సమ్మె విరమణతో కేజీబీవీలలో మళ్ళీ తరగతులు ప్రారంభం కానున్నాయి.



కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తుకారం, గౌరవ అధ్యక్షులు మోహన్, కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్, అధికార ప్రతినిధి పవన్, కార్యదర్శి దుర్గం సందీప్, ఆనంద్, బిందు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు అరుణ, నలంద, మీనా, కవిత పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పత్తి గటాన్ పడి కూలీ మృతి

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో స్వప్న జిన్నింగ్ మిల్లులో ప్రమాదవశాత్తు పత్తి గటాన్ పడి కూలీ మృతి చెందిన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్ పట్టణంలోని కుర్షిద్‌నగర్ కాలనీకి చెందిన గాయక్వాడ్ శాంతారాం(54) గత రెండు నెలలుగా స్థానిక స్వప్న జిన్నింగ్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో జిన్నింగ్ ఆవరణలో దీపక్ అనే మరో కూలితో కలిసి పత్తి గటాన్‌లు ఒక క్రమంలో పెడుతుండగా ప్రమాదవశాత్తు 1.7 క్వింటాల్ బరువున్న గటాన్ శాంతారాంపై పడింది. దీంతో ఆయన ముఖంపై చాతిపై గటాన్ బలంగా పడటంతో ఆయనకు తీవ్ర రక్తస్రావమై స్పృహ కోల్పోయి పడిపోయాడు. ఆయనను వెంటనే స్థానిక ప్రభుత్వ సివిల్ అస్పత్రి కి తరలించి, చికిత్సలు చేయించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య గాయక్‌వాడ్ నీలాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

నవతెలంగాణ-కౌటాల



ఎంపీడీఓ కార్యాలయాన్ని జడ్పీ సీఈఓ లక్ష్మీనారాయణ మంగళవారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులతో పాటు సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలని ఎంపీడీఓను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎక్కడ కూడా నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. అనంతరం కార్యాలయ ఆవరణను చూసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కోటప్రసాద్, ఎంపీఓ మహేందర్ రెడ్డి, ఏపీఎం పూర్ణిమ ఉన్నారు.

సీనియర్ సిటిజన్ల చట్టాలపై అవగాహన కల్పించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో సీనియర్ సిటిజన్లకు ఉన్న చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలని సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, జిల్లా నాయకులు జి. పూర్ణచందర్‌రావు, కలికోట రమణయ్య, నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు, చిలుక లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. అధికారులు, సామాజిక కార్యకర్తలు, సీనియర్ సిటిజన్లు, విద్యార్థులకు ఈ చట్టాలపై అవగాహన కల్పిస్తే వారి కుటుంబంలోని పెద్దల పట్ల గౌరవాన్ని కలిగి ఉంటారని ఆయన పేర్కొన్నారు.

యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ జిల్లా కన్వీనర్‌గా మారుతి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని చిచ్చుపల్లి గ్రామానికి చెందిన పెందోర్ మారుతి యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ జిల్లా మండల కన్వీనర్‌గా, లీంగూడ గ్రామానికి చెందిన సోయం సంజీవ్‌ను కో కన్వీనర్‌గా నియమించినట్లు జిల్లా కన్వీనర్ పెద్దీవార్ ప్రశాంత్ మంగళవారం తెలిపారు. గతంలో వీరు బీజేపీ పార్టీలో క్రియాశీల సభ్యులుగా పని చేశారన్నారు. ఎంపికైన వారు మాట్లాడుతూ ఆర్టీఐ అవినీతి అక్రమాలకు తావు లేకుండా అవినీతి పాలనకు ఒక వజ్రాయుధంగా పనిచేస్తుందన్నారు. తమపై నమ్మకంతో ఎన్నిక చేసినందుకు జిల్లా కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగిపై దాడి: కేసు నమోదు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

ఉద్యోగిపై దాడి చేసిన కేసులో మరో ఉద్యోగిపై కేసు నమోదైనట్టు ఎస్సై లింబ్రాది తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..నిర్మల్ రూరల్ మండలంలోని వెంగ్వాపేట్ జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయులు ఉల్లెంగుల గజ్జారాం విధుల్లో ఉన్నారు. గతంలో తల్వేద ఎంపీపీఎస్‌లో పని చేసిన నాకిడి బక్కన్న 8 ఆగస్టు-2024లో మరణించారు. చనిపోయిన నాకిడి బక్కన్నకు రావాల్సిన బిల్లులు జెడ్పీఎస్ఎస్ వెంగ్వాపేట్‌లో చేయాల్సి ఉంది. కాగా మంగళవారం ఉదయం చనిపోయిన నాకిడి బక్కన్న కుమారుడు నాకిడి ఆదిత్య వెంగ్వాపేట్ స్కూల్‌కి వచ్చి తన నాన్నకు సంబంధించిన బిల్లు చేయమని ఉల్లెంగుల గజ్జారాంని అడిగాడు. కరెంట్ లేదని చెప్పి బయట చేయించుకోవాలని చెప్పాడు. అతను అక్కడి నుంచి వెళ్లిపోయి, తర్వాత నాకిడి ఆదిత్య మళ్లీ స్కూల్‌కు వచ్చి బిల్లు చేయమంటే ఎందుకు చేయడం లేదని, గొడవ పడి కర్రతో కొట్టాడు. దీనిపై ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఆటో బోల్తా పడి ఒకరి మృతి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలోని దేగామ గ్రామ సమీపంలోని సబ్ స్టేషన్ దగ్గర మూల మలుపు వద్ద ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గిర్నూర్ గ్రామానికి చెందిన పల్లెపు రాకేష్ ఆటో నెంబర్ టీఎస్ 01యూఏ 6533 అనే ఆటోలో పోచమ్మ దగ్గర విందుకు వచ్చి తిరుగు ప్రయాణంలో సబ్ స్టేషన్ దగ్గరలో ఉన్న మూలమలుపు వద్ద ఆటో బోల్తా పడటంతో గిర్నూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి అడెల్ల అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా వారిని అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించినట్టు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-బోథ్

నూతన గ్రామపంచాయతీని ఏర్పాటు చేయాలని మంగళవారం మండలంలోని మామిడిగూడ, గొల్లాపూర్ గ్రామస్తులు ఎంపీడీఓ రమేష్‌కు, మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డితో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ పార్డి(కె) గ్రామపంచాయతీలోని గోల్లాపూర్, మామిడిగుడా, గొల్లాపూర్ తండ గ్రామాలని నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల సౌలభ్యం కోసం గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా 200 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయబోతుందని మండలంలోని పరుపులపల్లె, టివిటిపల్లె గ్రామాలను ఒక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీఓను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, నాయకులు మెస్రం లాలూరామ్, తొడసం ముత్యం, మెస్రం దత్తు పాల్గొన్నారు.

ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

ప్రజలు ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించాలని సీఐ రామకృష్ణ, ఎస్సై లింబాద్రి అన్నారు. మంగళవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా మండలంలోని తల్వెద ఎక్స్ రోడ్డు వద్ద ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తే, ప్రమాదాలు నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని బంబారా గ్రామానికి చెందిన బొరికార్ ప్రత్యూష(23) ఈ నెల ఆరో తేదీన ప్రతి రోజులాగా రాత్రి భోజనం చేసి సుమారు రాత్రి 11 గంటలకు తన కూతురుతో మాట్లాడి చేనులో కావలి పనికి వెళ్ళాడు. మంగళవారం ఉదయం ఐదు గంటలకు ప్రత్యూష తల్లి లేచి చూసే సరికి ప్రత్యూష మంచంపై లేకపోవడంతో వెంటనే భర్త గులాబ్‌కు ఫోన్ చేసి చెప్పడంతో ఇంటికీ వచ్చి ప్రత్యూష స్నేహితులకు ఫోన్ చేసి అడుగగా అక్కడికి రాలేదని తెలపడంతో ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లబించలేదు. యువతి తండ్రి బోరికార్ గులాబ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు.

పెద్ద సిద్దాపూర్‌లో రగ్గులు పంపిణీ



నవతెలంగాణ-బెజ్జూర్

బెజ్జూర్ రేంజ్ పరిధిలోని పెద్ద సిద్దాపూర్ గ్రామంలో మంగళవారం అటవీశాఖ ఆధ్వర్యంలో వృద్దులకు రగ్గులు పంపిణీ చేశారు. ఎఫ్ఆర్ఓ ముసవీర్ ఆదేశాల మేరకు రగ్గులు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో బెజ్జూర్ సెక్షన్ అధికారి మల్లికార్జున్, ఎఫ్‌బీఓలు వెంకటేష్, మురళీ, మాజీ సర్పంచ్ రవి కుమార్ పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షా శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ ఆసుపత్రిలో మంగళవారం శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరానికి 24 మంది కంటి బాధితులు హాజరు కాగా ఇందులో తొమ్మిది మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి బెల్లంపల్లి లయన్స్ క్లబ్ వారి సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఈ కంటి పరీక్షా శిబిరాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆదివాసులకు అండగా ఉంటాం



నవతెలంగాణ-కెరమెరి

ఆదివాసులకు అన్ని వేళల అండగా ఉంటామని ఎస్సై గుంపుల విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కోలాం ఝరి గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో ఆదివాసులకు దుప్పట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో చలి తీవ్రత పెరిగిందన్నారు. వృద్దులు ఇబ్బందులు పడకుండా తమ వంతు బాధ్యతగా దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. సుమారు 80 మంది వృద్దులకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ పద్ధతిన పోస్టుల భర్తీకి దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిన 52 వివిధ రకాల పోస్టుల భర్తీకి అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో 15 ల్యాబ్ అటెండెంట్, 7 డాటా ఎంట్రీ ఆపరేటర్, 3 రేడియోగ్రాఫిక్ సాంకేతిక నిపుణులు, 3 సీటీ స్కాన్ టెక్నీషియన్, 2 ఈసీజీ టెక్నీషియన్, 4 అనస్తీషియా టెక్నీషియన్, 4 దోభి, ప్యాకర్స్, 2 ఎలక్ట్రీషియన్, 1 ప్లంబర్, 1 డ్రైవర్ (భారీ వాహనం), 4 థియేటర్ అసిస్టెంట్, 2 గ్యాస్ ఆపరేటర్, 4 వార్డ్ బాయ్ పోస్టులు కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు పైన తెలిపిన పోస్టులకు సంబంధిత ధ్రువీకరణ పత్రాల నకలు ప్రతులను స్వీయ ధ్రువీకరణ చేసి దరఖాస్తుతో జత పరచాల్సి ఉంటుందని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 7 నుండి 17వ తేదీ వరకు ప్రభుత్వ వైద్య కళాశాలలో కార్యాలయ పని వేళలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారం, విద్యార్హత, ఇతర వివరాల కోసం కళాశాల వెబ్ సైట్ జీఎంసీకుమురంభీంఆసిఫాబాద్.ఓఆర్‌జీ, జిల్లా అధికారిక వెబ్ సైట్ ఆసిఫాబాద్.తెలంగాణ.జీఓవీ.ఇన్‌లలో సంప్రదించవచ్చని, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో గురువారం జూనియర్ బాలుర ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సంఘం అధ్యక్షులు గోనే శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. రేపు ఉదయం 10:30 గంటలకు రిపోర్టు చేయాలని, ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 10న మధ్యాహ్నం 3 గంటలకు క్యాంపు ప్రారంభించబడుతుందని, ఇతర వివరాలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగు, కోచ్ సోనార్కర్ అరవింద్‌కు రిపోర్టు చేయాలన్నారు. 9550909870 నెంబర్లను సంప్రదించాలన్నారు.